క్లుప్తంగా

చల్లగా చూడమ్మా..



జాతరలో పాల్గొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: అందరినీ చల్లగా చూడమ్మా అంటూ కొల్లాపురమ్మ అమ్మవారిని పర్యాటక శాఖ మంత్రి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని కల్యాణపురం ఎస్టీ కాలనీలో జరిగిన కొల్లాపురి జాతరలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, బుజ్జి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునాళ్ల



అలంకరణలో అమ్మవారు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో బీసీ కాలనీలో ఆదివారం గ్రామ దేవత కొల్లాపురి అమ్మవారి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ఆలయ అవరణలో మ హిళలు అంబలి పోసి సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి పొంగలి పెట్టి నైవేద్యం పెట్టారు. అలాగే అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. గ్రామ సర్పంచ్ బాబురెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

మునీశ్వరుడికి ప్రత్యేక పూజలు




స్వామివారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పాతచెరువు కట్టకింద వెలసిన మునీశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజకు కావలసిన సామగ్రిని టీ.రాజ్ కుటుంబ సభ్యులు పంబ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక దీపారాధన చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు గడప గడపకు..

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కేశవకుప్పం గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశవకుప్పం సచివాలయ పరిధిలోని జీలావారికండ్రిగ, ఎద్దారపుకండ్రిగ, పశలవానిపిట్ట, మరిమాని ఇండ్లు, తానా ఇండ్లు, కేశవకుప్పం, కేశవకుప్పం ఎస్టీకాలనీలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకుంటారని, అలాగే గ్రామంలోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పరాశరేశ్వరుడి కటాక్షం



ఊరేగింపులో పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఆదివారం సాయంత్రం రథోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్య పూజా కైంకర్యాలు, పరివార దేవతలకు అభిషేకాలు, స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో చెక్క రథం లేకపోవడంతో సాయంత్రం సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేందర్, ఏఈఓ పార్థసారతి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని డిప్యూటీ ఈఓ తెలిపారు.

'స్వర్ణముఖి మ్యూజిక్' పాట చిత్రీకరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెండ్లిమండపం వద్ద స్వర్ణముఖి మ్యూజిక్ యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో పాట చిత్రీకరణను ఆదివారం ప్రారంభించారు. నిర్మాత గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ గతంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి గురించి చిత్రీకరించిన పాట విజయవంతమైందన్నారు. ప్రస్తుతం పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను అనాథ శరణాలయాలు, రోడ్లపై వదలివేస్తున్న వారికి ఈ పాట ఓ సందేశమన్నారు. కార్యక్రమంలో ఉంగరాల మునెయ్య, సాంబ రషీద్, గంగపుత్ర గాంధీ, నెల్లూరు జగదీష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

చిదా మోసం



నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన పుత్తూరులోని చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతోంది. కార్మికులకు తీరని అన్యాయం చేస్తూ ఇక్కడి నుంచి తరలి పోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ అక్రమాన్ని కార్మికులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. వీరి పోరాట ఫలితంగా శనివారం తిరుపతిలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కోర్టులో ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ కేసు నమోదు అయింది.

- ప్రభుత్వ అనుమతి లేకుండానే మిల్లు మూసివేతకు చిదా స్పిన్నింగ్ యాజమాన్యం తంటాలు
- యంత్రాల తరలింపునకు యత్నాలు: అడ్డుకుంటున్న కార్మికులు
- ఇండస్ట్రియల్ డెస్ప్యూట్ కేసు నమోదు చేసిన డీసీఎల్



డీసీఎల్ బాలు నాయక్ సమక్షంలో మిల్లు మేనేజర్, కార్మికుల మధ్య సమావేశం

పుత్తూరు రూరల్: పట్టణంలోని చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం మిల్లు మూసివేతకు ముందుగానే రూపొందించుకున్న కార్యాచరణను అమలు చేస్తూ వస్తోంది. గతంలో సుమారు 600 మంది రెగ్యులర్ ఉద్యోగులతో కళకళలాడింది ఈ మిల్లు. అయితే గతేడాది నుంచి దశలవారీగా కార్మికులను తొలగిస్తూ వచ్చింది. ఈ ఏడాది ప్రారంభానికి 171 మంది మాత్రమే పనిలో ఉన్నారు. ఫిబ్రవరి 2022లో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా కొనసాగించాల్సి ఉంది. ఈ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఈఏడాది మార్చి 1న మిల్లు యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. అప్పటి నుంచి కార్మికులు పోరాటం చేస్తున్నారు. దీనిపై కార్మిక సంఘాల నాయకులు డీసీఎల్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన డీసీఎల్ మిల్లు మేనేజ్‌మెంట్‌ను తిరుపతికి పిలిపించి కార్మిక సంఘ నాయకులతో కలిసి చర్చలు జరిపారు. మిల్లు యాజమాన్యం మిల్లును మూసివేస్తున్నట్లు స్పష్టం చేశారు. దీనిపై డీసీఎల్ మిల్లును మూసివేయడానికి 45 రోజుల ముందుగా ప్రభుత్వానికి మూసివేతకు గల కారణాలు తెలియజేసి అనుమతి పొందాలని స్పష్టం చేశారు. యాజమాన్యం ప్రభుత్వానికి మిల్లు మూసివేయడానికి అనుమతి ఇవ్వాలంటూ నివేదిక సమర్పించినా నేటికీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా చట్ట వ్యతిరేకంగా మిల్లును యాజమాన్యం ఇతరులకు విక్రయించి, యంత్రాలను తరలించడానికి ప్రయత్నించింది. నెలల తరబడి మిల్లు వద్దే ఆందోళన చేస్తున్న కార్మికులు ఈ యంత్రాల తరలింపును అడ్డుకున్నారు.

ఆ 28 మంది..

మిల్లు యాజమాన్యం మొత్తం 171 మంది కార్మికుల్లో 143 మందిని భయపెట్టి, ప్రలోభపెట్టిన యాజమాన్యం వారి వద్ద నుంచి సంతకాలు సేకరించింది. వాస్తవానికి మూసివేతకు ప్రభుత్వం అనుమతించిన తర్వాత జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి నిర్ణయించిన పరిహారాన్ని కార్మికులకు అందజేయాల్సి ఉంది. ఈ నిబంధనలను ఏమీ పట్టించుకోకుండా వారికి ఇష్టం వచ్చినట్లు, తోచినంత చెల్లించి చేతులు దులుపుకున్నారు. అయితే మిగిలిన 28 మంది మాత్రం గత 4 నెలలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు.

కేసు నమోదు..

యాజమాన్యం, కార్మికుల మధ్య సయోధ్య కుదరనప్పుడు లేబర్ కోర్టులో పారిశ్రామిక వివాద కేసులు నమోదు అవుతాయి. ప్రస్తుతం ఈ స్థితికి చిదా స్పిన్నింగ్ మిల్లు వ్యవహారం వచ్చింది. చిదా యాజమాన్యంపై శనివారం తిరుపతిలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ బాలునాయక్ సమక్షంలో ఇరుపక్షాల మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. వెంటనే కార్మికులు డీసీఎల్‌కు ఐడీ పత్రాలు సమర్పించారు. దీంతో ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ కేసు నమోదు అయింది. దీనిపై తుది తీర్పు వచ్చేంత వరకు యాజమాన్యం మిల్లును అమ్మడం కానీ, యంత్రాలను తరలించడానికి వీలులేదు.



డీసీఎల్‌కు ఐడీ కేసు నమోదు పత్రాలు సమర్పిస్తున్న కార్మికులు

లేబర్ ట్రిబ్యునల్‌కు పంపుతాం..



“ మిల్లును మూసివేస్తున్నారు గనుక తమకు మిగిలిన సర్వీసు మేరకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. యాజమాన్యం మేము చట్టప్రకారం ఒక స్ట్రాటజీ ప్రకారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామంటున్నారు. ఈ వ్యవహారాన్ని లేబర్ ట్రిబ్యునల్‌కు పంపుతాం. అక్కడ తుది నిర్ణయం వెలువడుతుంది. అప్పటి వరకు యథాస్థితి కొనసాగుతుంది.

– బాలు నాయక్, డీసీఎల్, తిరుపతి

న్యాయం అడుగుతున్నాం..



లాభాలు ఆర్జించి పెట్టిన కార్మికులకు న్యాయం చేయమని కోరుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా మిల్లును మూసివేశారు. పది, పదిహేను సంవత్సరాల సర్వీసు ఉన్న వారి పరిస్థితిని ఆలోచించమని ప్రాధేయపడుతున్నాం. ఏకపక్ష నిర్ణయంతో కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. న్యాయం కోసమే లేబర్ కోర్టును ఆశ్రయించాం.

– చక్రవర్తి, కార్మికుడు, పుత్తూరు

పేదవారికి రక్షణగా జగనన్న సురక్ష

- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



నారాయణస్వామి

పాలసముద్రం : పేదవారికి రక్షణగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఆయన జగనన్న సురక్ష పథకంపై మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ పథకాన్ని ప్రారంభిచారన్నారు. ప్రతి ఒక్కరూ పకడ్బందీగా ఈ పథకాన్ని అమలు చేసి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ నెల 24 నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, జూలై 1 నుంచి సచివాలయాల వద్ద నాలుగు వారాల పాటు ప్రత్యేక క్యాంపుల నిర్వహణ, అన్ని రకాల వినతులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న 11 రకాల సేవలకు సర్వీస్ చార్జీలు ఉచితంగా అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పౌర సేవలు సచివాలయాల ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అర్హత మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని, కులం, మతం, పార్టీ ఏవీ చూడకుండా పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడా రూపాయి లంచం ఇచ్చే అవసరం లేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గ్రామాలకు వెళ్లి అడిగేవారని, తరువాత గ్రామాల వైపు పోయిన ఎమ్మెల్యేలు లేరన్నారు. కానీ జగనన్న పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల ఇళ్లకు వెళ్లి వారితో మమేకమవుతున్నారని, ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కరిస్తున్నారని తెలిపారు.

నివాళులు



మునస్వామి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : సీనియర్ పాత్రికేయుడు ఎంజీఆర్ తండ్రి మునస్వామి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి గ్రామానికి వెళ్లి మునస్వామి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాత్రికేయుడు ఎంజీఆర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

అలరించిన బలిబండి కుంభాలు



బలి కూడుతో వెళ్తున్న ఎడ్లబండ్లు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం బండికుంభాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భీముని వేషధారితో పాటు బలి కూడును ఎడ్లబండ్లలో తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఉదయమే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా పట్టుపీతాంబరాలు, వెండితొడుగులతో కూడిన అలంకరణ వస్తువులతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి విజయకుమారి హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం యువత పెద్దఎత్తున బాణసంచా పేల్చుతూ బండికుంభాలతో ఆలయ ఆవరణలోకి ప్రదర్శనగా తీసుకురావడం ఆకట్టుకున్నాయి. యువత సందడి చేశారు. శనివారం రాత్రి పాండవ జననం నాటక ప్రదర్శన ఆకట్టుపువాయిద్యాల నడుమ యుకుంది.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

- హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కార్వేటినగరం: ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కలను నెరవేర్చుతున్నాయని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శని, ఆదివారం ఆయన రెండు రోజుల పాటు పక్కాగృహాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అందరికీ ఇళ్లు) పథకాన్ని ప్రారంభించి 2015లో ప్రారంభించగా, 2023 నాటికి నెరవేరిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరికమే అర్హత, ప్రామాణికంగా భావించి ఇళ్ల స్థలాలతో పాటు గృహ నిర్మాణాలను చేపట్టి పేదల కళ్లలో ఆనందం చూస్తున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో కూడా జగనన్న కాలనీలు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్వేటినగరంలో పద్మసరస్సు లేఅవుట్‌లో 149 పక్కాగృహాలు మంజూరు చేశామని, అందులో 50 ఇళ్లు పూర్తి స్థాయికి చేరుకున్నాయని చెప్పారు. మిగిలినవి వివిధస్థాయిలో ఉన్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ పేదరికంతో ఇబ్బంది పడుతున్న తమకు సొంతింటి కల నెరవేర్చి తమ బతుకుల్లో వెలుగులు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. పక్కాగృహాలు మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని ఎన్నటికీ మరువమన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డైరెక్టర్ పద్మనాభం, ఎంపీడీఓ మోహన్‌మురళి, సర్పంచ్ ధనంజయవర్మ, హౌసింగ్ ఏఈ యోగమూర్తినాయుడు, పంచాయతీ ఈఓ పీఎస్ మణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కేశవులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

నేటి నుంచి ట్రాన్స్‌కో సమావేశాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో 26 నుంచి 28 వరకు సబ్‌స్టేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. 26న ఆవులకొండ, వేపంజేరి, బలిజకండ్రిగ, మత్తంపల్లె, పెనుమూరు, ఉగ్రణంపల్లె, ఎం.బండపల్లె, పి.కొత్తకోట, ఎగువపాలకూరు, కొత్తపల్లె, సీకేపల్లె, బీఎస్ఆర్‌పేట, దొడ్డిపల్లె, 27న జీడీనెల్లూరు, నందనూరు, పేటమిట్ట, పోలవరం, పాపసముద్రం, 197 రామాపురం, వెంగనపల్లె, తాళంబేడు, చెర్లోపల్లె, 28న ఎస్ఎస్‌కొండ, తానా, టీవీఎన్‌పురం, వీఆర్ కుప్పం, పూతలపట్టు, తలుపులపల్లె, అన్నపల్లె, రెడ్డిగుంట, తుమ్మిందపాళ్యం ప్రాంతాల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. వినియోగదారులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు, లబ్ధిదారులు

వెదురుకుప్పం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మాచెరువు జగనన్న కాలనీలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరూ ఇళ్లు లేదని బాధ పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి వెలుగు ద్వారా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థిక పెన్నిది.. స్త్రీనిధి..

మండలం	సంఘాలు	సభ్యులు	స్త్రీనిధి రుణం
గంగాధరనెల్లూరు	1,485	19,305	రూ.6.2కోట్లు
శ్రీరంగరాజుపురం	1007	13,091	రూ.4.1 కోట్లు
కార్వేటినగరం	1040	14,560	రూ.3.8 కోట్లు
వెదురుకుప్పం	1122	14,586	రూ.4.3కోట్లు
పెనుమూరు	979	12,727	రూ.4.6కోట్లు
పాలసముద్రం	513	5526	రూ.3.3కోట్లు

మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక డ్వాక్రా రుణాలు మాఫీ చేసి మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తోంది. ఇప్పుడు వారు మరింత ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తోంది. ఈ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళల పాలిట ఆర్థిక పెన్నిధిగా మారుతోంది. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు స్త్రీనిధి రుణాలు జీవనోపాధితో పాటు కుటుంబపోషణ, ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయి.

- మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న సబ్సిడీ రుణాలు
- ఇప్పటికే డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్న ప్రభుత్వం
- ఒక్కో సభ్యురాలికి రూ.4.50 లక్షల వరకు రుణ సదుపాయం
- ఎలాంటి హామీ లేకుండా 48 గంటల్లోనే మంజూరు



డ్వాక్రా సంఘాల సభ్యులు (ఫైల్)

పాలసముద్రం: ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హతే ప్రామాణికంగా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేస్తుండడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. తీసుకున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు వాటిని సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. కొందరు తమ పిల్లల ఉన్నత విద్య కోసం, మరికొందరు పాడి పశువులను కొనుగోలు చేసి పాలను విక్రయించి ఆర్థికంగా వృద్ధిలోకి వస్తున్నారు. ఇంకొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకుని కుటుంబ పోషణ చూసుకుంటున్నారు. మహిళా ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడంతో పాటు అవసరమైన మేర స్త్రీనిధి రుణాలను అందించి లక్ష్యాన్ని అధిగమించడానికి కృషి చేస్తోంది. పాలసముద్రం మండలవ్యాప్తంగా 5,526 మంది డ్వాక్రా సభ్యులు ఉండగా వీరిలో 256 మంది వరకు స్త్రీనిధి కింద రుణాలు తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధన వైపు అడుగులు వేస్తున్నారు.

లక్ష్యాలు ఇలా..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 2021–2022 ఆర్థిక సంవత్సరంలో రూ.24 కోట్లు, 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్ల లక్ష్యం ఇచ్చారు. వీటిని సభ్యులు అధిగమించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్లను లక్ష్యంగా నిర్ధారించగా, ఇప్పటికే రూ.13 కోట్లు మేర రుణాలను అందించారు. స్త్రీనిధి రుణాలు అవసరమైన సభ్యులు గ్రామ వీఏలకు సమాచారం అందిస్తే 48 గంటల్లోనే సంబంధిత బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

టీడీపీ హయాంలో గ్రూపులో ఉన్న ఐదుగురు సభ్యులను మాత్రమే ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.20 వేలు మాత్రమే రుణం ఇచ్చేవారు. అది కూడా తమ అనుయాయులకే అందజేసేవారు. మిగతా గ్రూపు సభ్యులకు ఏ కష్టం వచ్చినా పట్టించుకునేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్వాక్రా సంఘాలకు పెద్దపీట వేశారు. ఒక్కో గ్రూపునకు రూ.4.50 లక్షల చొప్పున స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు. అర్హులైన సభ్యులకు వారి అవసరాలను బట్టి రుణాలను అందిస్తున్నారు. అది కూడా సంబంధిత వీఏలకు సమాచారం ఇస్తే 48 గంటల్లోనే రుణాలను సభ్యుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

గ్రేడ్ ఆధారంగా..

గ్రామ సమైక్య సంఘాలను పరిగణనలోకి తీసుకుని స్త్రీనిధి రుణాలను మంజూరు చేస్తున్నారు. ఏ గ్రేడ్ సంఘానికి అయితే రూ.75 లక్షలు, బి గ్రేడ్‌కు రూ.65 లక్షలు, సి గ్రేడ్‌కు రూ.55 లక్షలు, డి గ్రేడ్ సంఘానికి రూ.45 లక్షలు చొప్పున రుణాలను అందజేస్తున్నారు.

జగనన్న వెలుగులు నింపుతున్నారు



మహిళల జీవితాల్లో సీఎం జగనన్న మరిన్ని వెలుగులు నింపుతున్నారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాలను సంఘాల సభ్యులు అంతా వినియోగించుకుంటున్నారు. మరికొందరు ఈ డబ్బును ఆర్థికంగా ఎదిగేందుకు వాడుకుంటున్నారు. మా మహిళల పాలిట దేవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయనకు డ్వాక్రా మహిళలు రుణపడి ఉంటాం.

–డి.మునెమ్మ, ఎంఎంఎస్, అధ్యక్షురాలు

లక్ష్యానికి మించి రుణాలు..



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని మించి స్త్రీనిధి రుణాలను డ్వాక్రా సంఘాల సభ్యులకు మంజూరు చేస్తున్నాం. గతేడాది రూ.2.30 కోట్ల లక్ష్యం కాగా రూ.3.30 కోట్ల రుణాలను అందించాం. పైసా ఖర్చులేకుండా 48 గంటల్లోనే రుణాలు మంజూరు చేస్తున్నాం. మహిళలు ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం.

–ఫరీద్ మస్తాన్, ఐకేపీ ఏపీఎం, పాలసముద్రం

వేడుకగా లక్కాగృహ దహనం



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామివార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి లక్కాగృహ దహనం కార్యక్రమాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు వేంకటేశ్వర నాటక కళామండలి ప్రదర్శించారు. అదేవిధంగా మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు చేసిన లక్కాగృహ దహనాన్ని భక్తులను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులైన రజకులు అమ్మవారికి సమర్పించిన సారెతో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవమూర్తులతో పాటు శ్రీకృష్ణుణ్ని సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవారిని ప్రతిష్ఠించి మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.